క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

దౌల్తాబాద్‌: చేనేత కార్మికులకు ప్రభుత్వం అభయహస్తం పథకం అమలునకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడంతో మండలకేంద్రంలో శనివారం చేనేత కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కార్మికులకు నేతన్న పొదుపునిధి, భరోసా, నేతన్న భద్రత కార్యక్రమాలు అమలు చేయనున్న సందర్భంగా సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అంజయ్య, పుల్లప్ప, రాము, ఆలుగుండశ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలే



చైనా మాంజాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

అనంతగిరి: తాండూరు పతంగుల దుకాణంలో జిల్లా టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు నిర్వహించిన తనిఖీలో శనివారం చైనా మాంజాను పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించగా ఓ దుకాణ యాజమాని సచిన్‌ నుంచి సుమారు రూ.6,400 విలువ చేసే 32 ప్యాకెట్ల నిషేధిత చైనా మాంజాను పట్టుకుని తాండూర్‌ పీఎస్‌లో తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిర్వహకుడిపై కేసు నమోదు చేశారని టాస్క్‌ ఫోర్స్‌ సీఐ ఆంజనేయులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దాసరి చంద్రప్ప

బొంరాస్‌పేట: మండల పరిధిలోని రేగడిమైలారంలో సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేశారు. కృష్ణప్పకు రూ.65వేలు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును కాంగ్రెస్‌ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప అందజేశారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చెక్కు పంపిణీ చేశారు. ఆర్థికభారం మోయలేని వారికి సీఎంఆర్‌ఎఫ్‌ సహకరిస్తుందన్నారు. పార్టీ గ్రామాధ్యక్షుడు కుమ్మరి గుండప్ప, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, శేఖరయ్య, ప్రసాద్‌గౌడ్‌, చిన్న నర్సింలు, వెంకటేశ్‌ పాల్గొన్నారు.

నేడు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

దౌల్తాబాద్‌: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ చౌరస్తాలో ఆదివారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు అసోసియేషన్‌ సభ్యులు తెలిపారు. ఉదయ 8గంటలకు మీది మోసటి హనుమాన్‌ దేవాలయం నుంచి శోభాయాత్ర నిర్వహించిన అనంతరం 10.30గంటలకు ఆవిష్కరించనున్నట్లు వారు తెలిపారు. అతిథుల సందేశానంతరం మధ్యాహ్న భోజన కార్యక్రమాలు ఉంటుందని పేర్కొన్నారు. కావున ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

అల్లిఖాన్‌పల్లిలో సదర్‌ ఉత్సవాలు నేడు

దుద్యాల్‌: మండలంలోని అల్లిఖాన్‌పల్లిలో సదర్‌ ఉత్సవాలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఏడాదికి ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాలకు యాదవ కులాస్థులు అందరు పాల్గొనాలని సూచించారు.

వివేకానందని ఆదర్శంగా తీసుకోవాలి

అనంతగిరి: స్వామి వివేకానందని ఆదర్శంగా తీసుకోవాలని మా శారదా ఆసుపత్రి డాక్టర్‌ రాజశేఖర్‌ రెడ్డి తెలిపారు. శనివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వాలీబాల్‌ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను యువత మార్గదర్శకంగా తీసుకుని మంచి బాటలో నడవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్‌ మాధవ రెడ్డి, నాయకులు సదానంద రెడ్డి, శివరాజ్‌, నవీన్‌ కుమార్‌, అమరేందర్‌ రెడ్డి ,శ్రీకాంత్‌, తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతుకు చేదు..!

పెట్టుబడి ఎక్కువ.. లాభం తక్కువ
- పెరిగిన సాగు విస్తీరణం
- అందుబాటులో లేని చక్కెర ఫ్యాక్టరీలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

బంట్వారం: అందరికీ తీపి అందజేసే చెరకు రైతు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర పలకడం లేదు. పెట్టుబడులు మాత్రం అమాంతం పెరుగుతున్నాయి. కానీ లాభం మాత్రం రావడం లేదని చెబుతున్నారు. బంట్వారం మండలంలోని తొర్మామిడి, బస్వాపూర్‌, బొప్పునారం కోట్‌పల్లి మండలం జిన్నారంలో అత్యధికంగా చెరకు సాగు చేస్తున్నారు. బోర్లు, బావుల్లో నీటి మట్టం ఎక్కువగా ఉండడంతో సాగు విస్తీర్ణం కూడా గతేడాది కంటే ఈ సంవత్సరం పెరిగింది. సుమారు రెండు వేల ఎకరాల్లో సాగు చేశారు. చక్కెర ఫ్యాక్టరీ అందుబాటులో లేకపోవడంతో ప్రతి ఏటా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు చార్జీలు రైతులకు మరో భారంగా తయారయ్యాయి. తొర్మామిడిలోని చక్కెర ఫ్యాక్టరీ చాలా కాలం కిందటే మూసేశారు. దీంతో సంగారెడ్డి, కొత్తకోట, కర్ణాటకలోని ఫ్యాక్టరీలకు చెరకును తరలిస్తున్నారు. డిసెంబర్‌లో ప్రారంభించిన కోతలు మార్చి చివరి వరకూ కొనసాగుతుంది.

పెరిగిన పెట్టుబడులు..

పెట్టుబడులు మాత్రం ఒక్కసారిగా పెరిగాయి. ఎకరాకు రూ.30వేలు ఖర్చు చేస్తునప్పటికీ దిగుబడి ఆశించినస్థాయిలో ఉండకపోవడం బాధాకరం. ఈ ఏడాది సంగారెడ్డి ఫ్యాక్టరీలో చెరుకు ధర టన్నుకు రూ.3,900లు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం టన్నుకు రూ. 100 పెరిగినప్పటికీ లేబర్‌ చార్జీలు, ట్రాన్స్‌పోర్టు ఖర్చు పోను చివరకు మిగిలేది టన్నుకు రూ.2,200లు మాత్రమే. ప్రైవేటు ఫ్యాక్టరీ యాజమాన్యాలు లాభార్జనతో తెల్ల చెరకు బదులుగా ఎర్ర చెరకు సాగు చేయిస్తున్నారు. చాలా కాలంగా ఇదే తంతు కొనసాగుతుంది. ఒక వేళ ఎవరైనా తెల్ల చెరుకు పండిస్తే ఫ్యాక్టరీలో కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది.



జిన్నారంలో సాగు చేసిన చెరకు

తగ్గిన దిగుబడి..

భూమిని బట్టి దిగుబడి వస్తుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో నల్లరేగడి, ఎర్ర నేలల్లో పండిస్తున్నారు. ఎకరాకు 40 టన్నులు రావాల్సి ఉండగా, 30 టన్నులకు పడిపోయింది. పెట్టుబడులు ఇతరత్ర ఖర్చులు పోను ఎకరాకు రూ.20 వేలు మిగిలితే ఎక్కువేనని రైతులు వాపోయారు.



లారీలో ఫ్యాక్టరీకి తరలిస్తున్న చెరకు

ఉపాధి హామీలో అనుసంధానం చేయాలి



ప్రధాన పంటగా సాగు చేసే చెరకును ఉపాధి హామీలో అనుసంధానం చేయాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. కూలీల సమస్య తీవ్రంగా ఉంది. చక్కెర ఫ్యాక్టరీ అందుబాటులో లేకపోవడంతో కష్టమవుతుంది. సంగారెడ్డి ఫ్యాక్టరీకి తీసుకెళ్లడంతో ట్రాన్స్‌పోర్టు చార్జీలు పెరుగుతున్నాయి. కర్ణాటకలోని చక్కెర ఫ్యాక్టరీల మాదిరిగా సంగారెడ్డి ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా లేబర్‌ను సమకూర్చాలి. చెరుకు కటింగ్‌ సీజన్‌లో దూర ప్రాంతాల నుంచి కూలీలను ఇక్కడికి తీసుకు రావాల్సి వస్తుంది.

– మోహన్‌రెడ్డి, రైతు, బస్వాపూర్‌

టన్నుకు రూ.6 వేలు పెంచాలి



టన్నుకు రూ.6 వేలు మద్దతు ధర పెంచాలి. సంగారెడ్డి ఫ్యాక్టరీలో దళారులదే పెత్తనం. యాజమాన్యం రైతులకు సకాలంలో పర్మిట్లు ఇవ్వడం లేదు. దళారులు చెప్పినట్లు వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వికారాబాద్‌ ప్రాంతలో ప్రభుత్వం చక్కెర కర్మాగారం ఏర్పాటు చేయాలి. కనీస మద్దతు ధరను నిర్ణయించి కొనుగోలు చేయాలి.

– మర్రి రాజిరెడ్డి, రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

గొడుగోనిపల్లి.. గోడు వినరేమీ!



గొడుగోనిపల్లి వద్ద.. పరిగి–మహబూబ్‌నగర్‌ ప్రధాన రహదారి

- వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు
- పట్టించుకోని అధికారులు

దోమ: భారీ వర్షాలతో గొడుగోనిపల్లి వాగు ప్రవాహానికి పరిగి–మహబూబ్‌నగర్‌ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ముఖ్యంగా దోమ మండలం గొడుగోనిపల్లి గ్రామశివారులో వాగు ప్రవాహం వల్ల రోడ్డు ఒక వైపు భారీగా దెబ్బతిన్నది. అధికారులు, గ్రామస్తులు కొందరు సున్నం పెట్టి హద్దురాళ్లు పెట్టినా అవి నామమాత్రంగా మిగిలిపోతున్న పరిస్థితి నెలకొంది. రోడ్డు ఒకవైపు పూర్తిగా దెబ్బతిని ప్రమాదభరితంగా మారింది. రోడ్డు దెబ్బతిని కొన్ని నెలలుకావస్తున్నా ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు.

ఊరికెళ్తున్నారా జాగ్రత్త?

మండల ప్రజలకు ఎస్‌ఐ ఎండీ రవూఫ్‌ సూచనలు

బొంరాస్‌పేట: సంక్రాంతి పండుగకు ఊరికెళ్తున్నారా? ఐతే తగిన జాగ్రత్తలు పాటించాలని మండల ప్రజలకు ఎస్‌ఐ ఎండీ రవూఫ్‌ పలు సూచనలు చేశారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇంటి భద్రత, దొంగతనాల నివారణలో పోలీసులకు సహకరించాలని కోరారు. ఊరికెళ్లే వారు తమతమ విలువైన వస్తువులను లాకర్లలో పెట్టిపోవాలన్నారు. ఎవరికైనా ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు ఉన్నట్లయితే అవీ పనిచేస్తున్నాయా? లేదా? సరిచూసుకొని వెళ్లాలన్నారు. ఊరికెళ్లేవాళ్లు స్థానిక పోలీసులకు, చుట్టుపక్కల బంధువులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే 100కి కాల్‌ చేసి సమాచారం చేరవేయాలన్నారు.

భూమిలేని రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోస

జాబ్‌కార్డులపై నివేదిక అందజేయనున్న అధికారులు

తాండూరు రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి భూమిలేని రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోస కార్యక్రమం ప్రారంభించనుంది. ఇం దులో భాగంగా గ్రామాల్లో భూమిలేని వారిని ప్రభుత్వం గుర్తించే పనిలో పడింది. పంచాయతీరాజ్‌ కమిషనర్‌ నుంచి అన్నీ మండలాల్లో ఉపాధిహామీ పథకంలో జాబ్‌ కార్డులపై ఆరా తీశారు. గ్రామాల్లో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి. ఎంత మంది ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకుంటున్నారు. రెండో శనివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న వారి జాబ్‌ కార్డులకు సంబంధించి నివేదిక ప్రభుత్వానికి పంపించనున్నారు. భూమిలేని వ్యక్తులు కనీసం ఉపాధిహామీ పథకంలో కేవలం 20 రోజులు పని చేసిన వారిని ప్రభుత్వం లబ్ధిదారులుగా గుర్తిస్తామని చెప్పడంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఎంపికపై కసరత్తు చేస్తోంది.

వడ్డె ఓబన్న సేవలు మరువలేనివి



వడ్డె ఓబన్న జయంతి వేడుకలో పలువురు నాయకులు



అనంతగిరి: వడ్డే ఓబన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

పరిగి: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌ లాల్‌కృష్ణ

పరిగి: వడ్డె ఓబన్న సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌ లాల్‌కృష్ణ పేర్కొన్నారు. బ్రిటీష్‌ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి ఓబన్న అని గుర్తు చేసుకున్నారు. శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో లాల్‌కృష్ణ మాట్లాడారు. దేశ స్వతంత్ర పోరాటంలో ఓబన్న త్యాగం మరువలేం అన్నారు. ఆయన చేసిన పోరాటాలను ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన చరిత్రను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హన్మంతుముదిరాజ్‌, మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ అయూబ్‌, సర్వర్‌, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: కలెక్టరేట్‌ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం వడ్డే ఓబన్న జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌ సుధీర్‌,బీసీ వెల్ఫేర్‌ అధికారి ఉపేందర్‌, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు స్విచ్‌లు ఏర్పాటు చేయాలి



పగలు కూడా వెలుగుతున్న లైట్లు

కొత్తూరు: విద్యుత్‌ను పొదుపుగా వాడడంతో పాటు సాధ్యమైనంత వరకు వృథా చేయొద్దని అధికారులు ప్రకటిస్తున్నారు. కాగా కొన్ని గ్రామాల్లో వీధి దీపాలకు ఏబీ స్విచ్‌లు లేని కారణంగా నిరంతరాయంగా వెలుగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో లైట్లకు ఒక చోటనే స్విచ్‌ ఏర్పాటు చేస్తున్నప్పటికీ సిబ్బంది సకాలంలో లైట్లను నిలిపివేయని కారణంగా విద్యుత్‌ వృథా అవుతోంది. మండలంలోని వైఎం తండాలో ఉన్న వీధి దీపాలకు ఏబీ స్విచ్‌లు లేకపోవడంతో పగలు, రాత్రి వెలుగుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి స్విచ్‌లు ఏర్పాటు చేసి విద్యుత్‌ వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



యాలాల: కబడ్డీ జట్టుతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు



దుద్యాల్‌: మాట్లాడుతున్న నాయకులు

దుద్యాల్‌: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని కాంగ్రెస్‌ కొడంగల్‌ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌ అన్నారు. శనివారం మండల పరిధిలోని హస్నాబాద్‌ గ్రామంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను దుద్యాల్‌ ఎస్‌ఐ భరత్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కబడ్డీ పోటీలకు గతంలో ఆదరణ ఉండేదన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలను హస్నాబాద్‌ గ్రామంలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ యూసుఫ్‌, జిల్లా కార్యదర్శి మెరుగు వెంకటయ్య, సంజీవ రెడ్డి, బాల్‌ రెడ్డి, ఆనంద్‌ రెడ్డి, శ్రీనివాస్‌, గ్రామ పార్టీ అధ్యక్షుడు భీములు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

యాలాల: ప్రభుత్వ పాఠశాలలో వసతులతో పాటు క్రీడల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని గౌతమి పాఠశాలలో నిర్వహించిన బీఎంఆర్‌ టోర్నీ ముగింపు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంతంలో బీఎంఆర్‌కప్‌ నిర్వహించడం పీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా బాధ్యులు వెంకట్‌రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మొగులయ్య, ప్రభాకర్‌ చారి, యాలాల మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, టీపీఎస్‌ తరపున గాజుల వీరేశం, జంగం సంతోష్‌కుమార్‌ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్‌ లక్ష్మారెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ స్వప్న, ఎంతఈఓ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, తదితరులు పాల్గొన్నారు.

ముందుకు సాగని కాల్వల పూడికతీత

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- సొంత డబ్బులు వెచ్చించి నిర్వహణ



కాల్వలో పూడికతీస్తున్న జేసీబీ

దౌల్తాబాద్‌: మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆయకట్టు కింద ఉన్న కాల్వల పూడికతీతను రైతులు సొంత డబ్బులతో తీయిస్తున్నారు. కొన్నేళ్లుగా కాల్వల్లో పూడికతీత పనులు చేయకపోవడంతో గతేడాది కూడా చెరువుకింద పూడికతీత పనులను వారే తమ డబ్బులు వెచ్చించి పనులు చేయించామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదు. కాల్వల్లో పేరుకపోయిన పూడికతీతను తీయించాలని రెవెన్యూ అధికారులను మొరపెట్టుకున్నా వారు స్పందించలేదని చెబుతున్నారు. దీంతో చెరువుకింద సాగు చేసే రైతులు సమావేశమై పూడికతీత పనులను తామే చేయించుకోవాలని ఒప్పందం చేసుకుని పనులు చేపడుతున్నారన్నారు. దీంతో రైతులందరూ కలిసి డబ్బులు జమచేసుకొని జేసీబీతో పూడికతీత పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే చెరువు పైభాగాన ఉన్న తూమును తెరిచి రైతులు కరిగెట్లు, నాట్లు వేస్తున్నారు. తూము కింద ఉన్న పొలాల వారు పూడికతీసి పనులు చేపట్టారు. మరో వారం రోజుల్లో సాగు పనులు ముమ్మరంగా సాగనున్నాయని పలువురు తెలిపారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



కుల్కచర్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నేతలు

కుల్కచర్ల: ఆదివాసి, చెంచుల ఉన్నతికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కొమురం భీం జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌ రెడ్డి ప్రకటించడం వారిపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఆదివాసి, చెంచు విద్యార్థులకు ఓవర్‌సీస్‌ స్కాలర్‌షిప్స్‌ మంజూరు చేయడంతో పాటుగా వారి ప్రాథమిక విద్యలో గోండు భాషను బోధించడానికి సైతం అనుమతులు ఇస్తున్నట్లు సీఎం ప్రకటించడం హర్షణీయమన్నారు. ఆదివాసి పొలాల్లో, ఇతర ప్రదేశాల్లో సోలార్‌ మోటర్లు ఉచితంగా ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారన్నారు. ఇందిర జల ప్రభ ఆధ్వర్యంలో చెంచుల పొలాలలో ఉచితంగా బోర్లు వేయనుండడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ కనకం మొగులయ్య, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఆంజనేయులు ముదిరాజ్‌, పాంబండ ఆలయ చైర్మన్‌ కోట్ల మైపాల్‌ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌ నాయక్‌, నాయకులు పెంటమీది వెంకటయ్య, జోగు వెంకటయ్య, కృష్ణ, రఘునాథ్‌ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సరఫరాకాని త్రీఫేస్‌ విద్యుత్‌



దీకేతండా సమీపంలో ఎండుతున్న వరినారు

ఎండుతున్న పంటలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

ధారూరు: మండలంలోని వివిధ గ్రామాలు, తండాలకు మంగళవారం నుంచి గురువారం వరకు త్రీఫేస్‌ కరెంట్‌ సరఫరాకాక రైతులు ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. శుక్రవారం నుంచి సరఫరాలో తీవ్ర అంతరాయ ఏర్పడుతుందని చెబుతున్నారు. రబీలో వరి సాగు చేయడంతో ఎదిగిన నారుకు నీరందక ఎండుతున్నాయని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు. తాండూర్‌–ధారూరు మధ్యలో గట్టెపల్లి గ్రామ సమీప వ్యవసాయ పొలంలో 11 కేవీ విద్యుత్‌ లైన్‌ స్తంభం పడిపోయిందని, అప్పటి నుంచి త్రీఫేస్‌ విద్యుత్‌ సరఫరా లేదని చెబుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని డీకేతండాకు చెందిన రైతు బాల్‌రాజ్‌నాయక్‌ వాపోయాడు. మరి కొన్ని రోజులు ఇలాగే ఉంటే వరినారు పూర్తిగా ఎండిపోతుందన్నారు. వేరుశెనగ పంట పూత దశలో ఉందని, నీటితడి లేకపోతే కాయ ఊరడం కష్టతరమని చెప్పారు. వరినారు కళ్లముందే ఎండిపోతుంటే కన్నీళ్లు వస్తున్నాయన్నారు. అధికారులకు మాత్రం తమ గోడు పట్టదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌లైన్‌ను సరిచేసి మేలైనా విద్యుత్‌ సరఫరా చేయాలని వారు కోరారు.

తహసీల్దారును సస్పెండ్‌ చేయాలి



మాట్లాడుతున్న చంద్రయ్య

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య

బొంరాస్‌పేట: భూమిని విరాసత్‌ చేయడంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, తహసీల్దారు ఆనంద్‌రావును సస్పెండ్‌ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్‌ చేశారు. శనివారం మండల పరిధిలోని కొత్తూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాది సెప్టెంబరులో దుద్యాల మండల తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న సమయంలో అదే మండలానికి చెందిన బోయిని అశోక్‌ తండ్రి మరణానంతరం అతనికి విరాసత్‌ చేయాల్సిన భూమిని సంబంధంలేని వేరే వ్యక్తులకు పట్టా చేశారని ఆరోపించారు. దీంతో అశోక్‌ కుటుంబం రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కలెక్టర్‌ స్పందించి ప్రస్తుతం పరిగి తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌రావును వెంటనే సస్పెండ్‌ చేసి క్రిమినల్‌ కేసు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.